క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో యోగా శిక్షణ



సామర్లకోట పంచారామ క్షేత్రంలో యోగా శిక్షణలో సిబ్బంది

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భక్తులకు గురువారం నుంచి ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు యోగా శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణకు హాజరయ్యే భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పిఠాపురం: గొల్లప్రోలు పాత బస్టాండ్ సమీపంలోని కనకదుర్గమ్మ గుడి సమీపంలో గురువారం పేకాట శిబిరంపై దాడి చేసి, నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.24,200 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు.

మృతుడి కుటుంబానికి సాయం



భూషణం కుటుంబానికి సాయం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొత్తపల్లి: అమీనాబాదుకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు ఏడిద నాగభూషణం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం ఆయన కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించి, రూ.10 వేల సాయం, నిత్యావసర వస్తువులు అందించారు. జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు కొండేపూడి శ్యామ్‌బాబు, రాజాజీ రాయ్, రాహుల్‌రాయ్, జుత్తుక బాబూరావు, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మోర్తా రవి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం... వినోదం

- వేసవి శిక్షణ తరగతులతో విద్యార్థులకు మేలు
- గ్రంథాలయాల్లో వివిధ అంశాలపై తర్ఫీదు

సామర్లకోట: వేసవి సెలవులు వచ్చాయంటే చాలు విద్యార్థులకు ఆనందమే.. ఆటపాటలతో సరదాగా గడిపే రోజులు కావడంతో సంబరమే.. ఇలాంటి సందర్భంలో వినోదంతో పాటు విజ్ఞానం అందివస్తే ఉత్సాహమే.. ప్రస్తుతం వేసవి శిక్షణ తరగతుల నిర్వహణతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీయడానికి గ్రంథాలయ సంస్థ కృషి చేస్తోంది. విద్యార్థులకు వేసవి సెలవులు ఇవ్వడంతో వారు బయట తిరగడం, చెడు స్నేహాలు చేసి పాడై పోయే ప్రమాదం ఉంది. దాంతో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల శిక్షణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సామర్లకోట గ్రంథాలయంలో గ్రంథాయ అధికారి బందిల రత్నమణి ఒక అడుగు ముందుకు వేసి విద్యార్థులకు ఆసక్తి ఉన్న అంశాలను గుర్తించి ఆయా రంగాలకు చెందిన ఉపాధ్యాయులను శిక్షణతో శిక్షణ ఇప్పిస్తున్నారు. దాంతో విద్యార్థులు గ్రంథాలయంలో చెస్, మ్యాథ్స్, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవడం, నీతికథలు చెప్పడం, బొమ్మల తయారీ, బొమ్మలు గీయడం వంటి అంశాలపై 25 రోజులుగా శిక్షణ పొందుతున్నారు. గ్రంథాలయాధికారి ప్రముఖ రచయితల పుస్తకాల వివరాలను తెలియజేసి వాటిని చదవడం ద్వారా విజ్ఞానం పెంచుకొనే విధానాన్ని వివరించారు. చిన్నతనం నుంచి పుస్తకాలు చదవడం ద్వారా పుస్తక పఠనంపై ఆసక్తి ఏవిధంగా పెరుగుతుందో తెలియజేయడంతో విద్యార్థులు పుస్తక పఠనంపై శ్రద్ధ చూపుతున్నారు. చదరంగం నేర్చుకోవడం ద్వారా ఎత్తులకు పైఎత్తులు ఏవిధంగా వేయాలో తెలుసుకున్నామని విద్యార్థులు అంటున్నారు. విద్యార్థులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శిక్షణ తరగతులు నిర్వహించడంతో గ్రంథాలయం ప్రతి రోజూ పర్యాటకులతో సందడిగా ఉంటుంది. విద్యార్థులకు పలు అంశాలు నేరిస్తూ.. వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు.



సామర్లకోట గ్రంథాలయంలో చెస్‌లో విద్యార్థులకు మెళకువలు నేర్పుతూ..

శిక్షణ ఇచ్చేందుకు ముందుకు..



ఆయా అంశాలపై శిక్షణ ఇవ్వడానికి ఉత్సాహంగా ఉపాధ్యాయులు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా చెస్ నేర్పడానికి యార్లగడ్డ రాజేష్, డ్రాయింగ్‌కు కొల్లి పెద్దిరాజు, మ్యాథ్స్‌కు కొమ్ము శివశేఖర్‌లు ముందుకు రావడంతో విద్యార్థుల్లో ఉత్సాహం పెరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు గత నెల 28 నుంచి జూన్ ఆరు వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తాం. – బందిల రత్నమణి, గ్రంథాలయాధికారి, సామర్లకోట

బొమ్మలు వేయడంపై ఆసక్తి



గ్రంథాలయంలో శిక్షణ ద్వారా బొమ్మలు వేయడంపై ఆసక్తి పెరిగింది. తరగతి గదిలో సైన్సు బొమ్మలు వేయడం అంటే భయంగా ఉండేది. బొమ్మలు వేయడంలో పెద్దిరాజు మాస్టార్ మెళకువలను నేర్పారు. దాంతో సొంతంగా బొమ్మ వేసే సామర్థ్యం పెరిగింది.

– పి.సత్యసూర్య సంజన, 9వ తరగతి, సామర్లకోట

నీతి కథలు తెలుసుకున్నాం



ప్రతి రోజు గ్రంథాలయంలో ఒక నీతి కథ చెప్పడం, ఆ కథలో ఉన్న నీతిని తెలుసుకోవడం ఆనందంగా అనిపించింది. నీతి, నిజాయితీ ఎప్పుడు గెలుస్తుందనే విషయాలను గమనించాలన్నారు. స్నేహితుల పట్ల ఏవిధంగా ఉండాలో నేర్చుకున్నాను.

– పి.జాహ్నవి, 6వ తరగతి, సామర్లకోట

అవగాహన పెంచుకున్నాం



నాకు చదరంగం ఏవిధంగా ఆడాలో తెలియదు. అయితే గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణలో చెస్‌పై అవగాహన పెంచుకున్నాను. భటులు, మంత్రులు, రాజును ఏవిధంగా కదిపి ఎత్తులు వేయాలో చెస్ మాస్టర్ రాజేష్ ఎంతో చక్కగా వివరించారు. చెస్ నేర్చుకోవడంతో ఏకాగ్రత పెరిగింది.

– వి.రాఘవేంద్ర, 9వ తరగతి, సామర్లకోట

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



వేసవి శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాగరాజు

పెద్దాపురం: విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం పుస్తక పఠనం, కథలు చదవడం చేయించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను వారికి నచ్చిన రంగంలో ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు జి.లక్ష్మీనారాయణ విటమిన్ల ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం

సామర్లకోట: అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న జి.మేడపాడు గ్రామానికి చెందిన మల్యాల సీతామహాలక్ష్మికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందింది. ఈ మేరకు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు గురువారం అచ్చంపేట క్యాంప్ కార్యాలయంలో ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును అందజేశారు. వేట్లపాలెం మాజీ ఉప సర్పంచ్ వల్లూరి శ్రీనివాసు పాల్గొన్నారు.

పేదలపై కక్ష సాధిస్తే ఊరుకోం..

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- ఎండీయూ ఆపరేటర్ల ధర్నాకు సంఘీభావం

పిఠాపురం: పేద, బడుగు బలహీన వర్గాలపై ప్రభుత్వం కక్ష సాధించాలని చూస్తే, సహించేది లేదని మాజీ ఎంపీ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎండీయూ వాహనాల సేవలను నిలిపివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఎండీయూ ఆపరేటర్లు ఆందోళన చేశారు. వీరికి మద్దతు పలికిన ఆమె మాట్లాడుతూ ఇప్పటికే కూటమి ప్రభుత్వం వలంటీర్లను తొలగించిందన్నారు. తద్వారా రాష్ట్రంలో రెండు లక్షల కుటుంబాల జీవనోపాధిని దెబ్బ తీసిందన్నారు. వలంటీర్ వ్యవస్థ అంటే ప్రజలకు అందించే సౌకర్యం.. ప్రతి ఇంటికి వెళ్లి వారి కష్టం సుఖం తెలుసుకుని ప్రభుత్వ పథకాలను వారికి నేరుగా అందించే ఏకైక వ్యవస్థ అన్నారు. ఇలాంటి వ్యవస్థ దేశంలో ఏరాష్ట్రంలో లేదని, దీనిని ఇతర రాష్ట్రాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసి అటు ప్రజలు, ఇటు రైతులకు ప్రభుత్వ సేవలను దూరం చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసిన పరిపాలనా వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. పేదల ఇంటికే నేరుగా రేషన్ సరకులను అందించే వాహనాలను ప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు. కేవలం మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ఉన్న కోపంతోనే ఆయన పేదల కోసం ఏర్పాటు చేసిన అన్ని వ్యవస్థలను దూరం చేస్తుందని ఆమె విమర్శించారు. ఎండీయూ ఆపరేటర్ల ఉపాధికి గండికొట్టడం దారుణమన్నారు. పేదలకు ఉపాధి కల్పిస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. మరోపక్క సంక్షేమ పథకాలను తొలగిస్తూ వేలాది మంది జీవితాలను రోడ్డుకెక్కించిందన్నారు. ఎండీయూ వ్యవస్థను వీటిని తిరిగి పునరుద్ధరించకపోతే తీవ్ర ఉద్యమం చేపడతామని ఆమె హెచ్చరించారు. ఎండీయూ ఆపరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో ఎండీయూ ఆపరేటర్లతో కలసి ఆందోళన చేస్తున్న వంగా గీత

జీవన ప్రమాణాలు పెంచేందుకు చర్యలు



బోటుపై అధికారులతో పర్యటిస్తున్న రాష్ట్ర పర్యాటక చీఫ్ మార్కెటింగ్ అధికారి పద్మారాణి

- టూరిజం చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మారాణి

కొత్తపల్లి: స్థానిక మత్స్యకారులు, చేనేత కార్మికుల జీవన ప్రమాణాలను పెంచేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర టూరిజం చీఫ్ మార్కెటింగ్ అధికారి పద్మారాణి అన్నారు. ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాల్లో గురువారం స్థానిక అధికారులతో కలసి ఆమె పర్యటించారు. ఉప్పాడ వీవర్స్ కాలనీలో చేనేత మగ్గాలను పరిశీలించి జాంధానీ చీరల తయారీ, అమ్మకాలు, కార్మికుల జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తీర ప్రాంతంలో పర్యటించారు. మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న మేజర్ హార్బర్‌ను పరిశీలించారు. రామన్నపాలెం ఉప్పుటేరులో బోటుపై పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పాడలో టూరిజం స్పాట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. ఉప్పాడ తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఉప్పాడలో చేనేత జాంధానీ చీరల ఉత్పత్తి పెంచేందుకు, కార్మికుల జీవనోపాధి పెంపొందించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై వివరాలను సేకరించి తద్వారా నివేదికను పంచాయతీరాజ్ శాఖకు సమర్పిస్తామని అన్నారు. టూరిజం కన్సల్టెంట్ నిష్టాగోయల్, క్రియేటివ్ డిజైనర్ మణికంఠ, ఎంపీడీఓ పి.రవికుమార్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమ్మె గురువారంతో 15వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయ ఎదురుగా సమ్మె చేస్తున్నారు. కేంద్ర కార్మిక సంఘాల సమ్మెతో తమకు సంబంధం లేదని, రాష్ట్ర మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం పిలుపు మేరకు సమ్మె నిర్ణయం ఉంటుందని స్థానిక మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వుండవిల్లి రామరాజు స్థానిక విలేకర్లకు తెలిపాడు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే డిమాండ్‌తో తాము సమ్మె చేస్తున్నామన్నారు. రూ.13 వేల జీతంతో జీవనం ఏవిధంగా గడపాలని ఆయన ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులతో ఇంజినీరింగ్ శాఖలో పనులు చేయిస్తున్నారని, వారి వల్ల ప్రజలకు ఏమైనా అసౌకర్యం కలిగితే తమకు సంబంధం లేదన్నారు. వారికి ప్రమాదాలు జరిగితే ఇంజినీరింగ్ శాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. 15 ఏళ్ల సీనియార్టీ ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధుల్లో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ. ఐదు లక్షలు నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలనే డిమాండ్‌లు ప్రభుత్వం వద్ద ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పులపకూర రామకృష్ణ, లంక శ్రీహరి, నక్క రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఇంజినీరింగ్ కార్మికులు

రైతు కష్టం... కన్నీటి మయం

సామర్లకోట: నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఈ ధాన్యంలో మొలకలు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు తడిసిన ధాన్యం పరిస్థితిపై భరోసా ఇవ్వాల్సిన సివిల్ సప్లయిస్ అధికారులు, వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది ఇటుగా రావడం లేదని వీకే రాయపురం రైతులు ఇంటి వెంకట్రావు, వెలమర్తి బుల్లి రాజు, తలారి దొరబాబు, రేలంగి రాంబాబులు ఆరోపిస్తున్నారు. ధాన్యం నూర్పిడి చేసి 15 రోజులుగా కళ్లాల్లోనే ఉన్నా అధికారులు పట్టించుకోక పోవడంతోనే ధాన్యం తడిసి ముద్దయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 16 శాతం తేమ ఉన్న ధాన్యాన్నే రూ.1500కు కొనుగోలు చేసిన దళారులు తడిసిన ధాన్యానికి ఏ రేటు కడతారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలులోనూ మొండిచేయి చూపింది. గురువారం మధ్యాహ్నం నుంచి కొద్ది పాటి తెరుపు ఇవ్వడంతో ధాన్యం ఆరబెట్టుకునే పనిలో ఉన్నామని రైతులు తెలియజేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



వీకే రాయపురంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

హత్య కేసు ఛేదించిన పోలీసులకు అవార్డులు



ఎస్పీ నుంచి అవార్డులు అందుకుంటున్న సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రామకృష్ణ, మణికుమార్ (కుడి నుంచి ఎడమకు)



క్రైమ్ సీఐ అంకబాబుకు రివార్డు అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

పిఠాపురం: ఇటీవల చేబ్రోలు వద్ద హత్య కేసును ఛేదించినందుకు పోలీసులను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గురువారం కాకినాడ క్రైం మీటింగ్‌లో అభినందించారు. ఇందులో పిఠాపురం సీఐ జి.శ్రీనివాసు, గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ, పిఠాపురం టౌన్ ఎస్సై మణికుమార్, క్రైం పార్టీ సిబ్బంది శ్రీనివాసరావు, విజయబాబు కుమార్, ఎస్.బాలాజీ, శ్రీనివాసరావు, రాఘవలకు అవార్డులు అందించారు.

క్రైమ్ టీమ్‌కు ఎస్పీ రివార్డులు

సామర్లకోట: పెద్దాపురం డివిజన్ క్రైం టీమ్‌కు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గురువారం రివార్డులు అందజేశారు. ఇటీవల రూ.10.24 లక్షల సొత్తు చోరీ జరగ్గా, 24 గంటల్లోనే కేసును పోలీసులు ఛేదించారు. దాంతో సామర్లకోట క్రైం స్టేషన్ సీఐ అంకబాబు, ఏఎస్సై బలరామ్, హెచ్‌సీలు రాధాకృష్ణ, శ్రీహరిలకు ఎస్పీ రివార్డులు అందజేశారు. ఈ మేరకు రివార్డులు అందుకున్న వారిని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు అభినందించారు. అన్నవరం బస్ కాంప్లెక్స్ వద్ద గుంటూరుకు చెందిన బోడపాటి నాగేశ్వరరావు అనే ప్రయాణికుడి బ్యాగ్ కోసి రూ.10 లక్షలు అపహరించిన విషయం విధితమే. ఇంటి స్థలం విక్రయించి తునిలో బస్సు ఎక్కి అన్నవరంలో దిగి గుంటూరు బస్సు కోసం నాగేశ్వరరావు వేచి ఉన్న సమయంలో బ్యాగ్‌ను విశాఖపట్నంకు చెందిన కంబాల శ్రీను అపహరించాడు. నిందితుడిని క్రైమ్ పోలీసులు పట్టుకుని, నగదు రికవరీ చేసినందుకు క్రైమ్ టీమ్‌కు రివార్డు దక్కింది.

భజే వాయుపుత్రా...

- భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి
- ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, హోమాలు

సామర్లకోట: నియోజకవర్గంలో హనుమజ్జయంతి వేడుకలను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. సామర్లకోట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త చింతామణి పతాంజలిశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, వివిధ రకాల పుష్పాలు, తమలపాకులతో పూజలు చేశారు. ఈ మేరకు వేదపండితులు ఆలయ ప్రాంగణంలో కలశపూజ చేసి హోమం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాట్లు చేశారు. భక్తుల ఏర్పాట్లను పతాంజలి శాస్త్రి స్వయంగా పర్యవేక్షించారు. స్థానిక అతిపురాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామికి ఆలయ పండితులు పద్మనాభాచార్యులు, రవికుమార్ ఆచార్యులు క్షీరాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులచే హనుమద్ పారాయణ నిర్వహించారు. కోట్లమ్మ చెరువువద్ద ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయం, స్టేషన్ సెంటర్‌లో వీరాంజనేయస్వామి ఆలయం, రాజీవ్ గృహకల్పలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

జై హనుమాన్

పిఠాపురం: నియోజకవర్గంలో హనుమద్ జయంతి వేడుకలు కనుల పండువగా జరిగాయి. పిఠాపురం జగ్గయ్య చెరువు సాయి ఆలయం వద్ద వేంచేసి హనుమంతుని విగ్రహం వద్దం వేడుకలు నిర్వహించారు. విగ్రహ దాత బాలిపల్లి రాంబాబు దంపతులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పిఠాపురం అనఘా దత్తక్షేత్రంలో హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణను విశ్వ హిందూ పరిషత్, జై హనుమాన్ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. నిర్వాహకులు దువ్వ వెంకటేశ్వరరావు, సురేంద్ర దత్త, ముఖ్య అతిథులుగా మర్రెడ్డి శ్రీనివాసరావు, మురాల శెట్టి సునీల్ కుమార్, చెల్లుబోయిన సతీష్ పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలంలో ప్రసిద్ధిగాంచిన శివాలయంలో దాసాంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు.

గొల్లప్రోలులోని కొత్తపేటలో హనుమద్ జయంతి ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లి, ఉప్పాడ, గోర్స, కుతుకుడుమిల్లి, కొండెవరం, యండపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గొల్లప్రోలులో హనుమంతునికి పూజలు చేస్తున్న వంగా గీత



సామర్లకోట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం భక్తుల బారులు

పెద్దాపురం మండలంలో..

పెద్దాపురం: స్థానిక మిరపకాయల వీధి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. రాజుగారి వీధిలో మట్టేవారి కల్యాణ మండపం నుంచి హనుమాన్ జయంతి కమిటీ, అఖండ హిందూ సభ్యులు, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శోభా యాత్ర నిర్వహించారు. పులిమేరులో చదలాడ జంక్షన్ వద్ద హనుమద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయ నిర్మాత తుమ్మల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో భజన సంకీర్తనలు, స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. జి.రాగంపేటలో సనాతన ధర్మ గీత ప్రచారకుడు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో గీతాజ్ఞాన యజ్ఞం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమాధిపతి మాతా సేవా నందగిరి, మేడిశెట్టి అంజిబాబు, సత్యకుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. వాలుతిమ్మాపురం దాసాంజనేయ స్వామి ఆలయంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు ప్రత్యేక పూజలు చేశారు.



సామర్లకోట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారు



పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో..



పెద్దాపురం మట్టేవారి కల్యాణ మండపంలో ఆంజనేయస్వామికి అభిషేకాలు

హిందూ ధర్మరక్ష ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



పిఠాపురంలో హిందూ ధర్మరక్ష ర్యాలీ

పిఠాపురం: హనుమద్ జయంతి సందర్భంగా గురువారం పిఠాపురంలో హిందూ ధర్మరక్ష నాయకుడు చేదులూరి గవరయ్య ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా మాతృమూర్తుల సారథ్యంలో దేశంలో ఆపరేషన్ సిందూర్ నిర్వహించారన్నారు. పిఠాపురం పాదగయ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకూ ర్యాలీ సాగింది.



పిఠాపురం అనఘా దత్త క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు